


# కరపత్రం

SINCE 2014

ఆదివారం సెప్టెంబర్ 14 2025 | సంపుటి :0 | సంచిక :328 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4

•మణిపూర్‌ను దేశంతో అనుసంధానం చేస్తాం
•రూ.7 వేల కోట్లతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

# దేశానికి మణిహారం మణిపూర్





మణిపూర్ పేరులోనే మణి ఉందని అది దేశానికే మణి వంటిదని, మణిపూర్ దేశానికి ప్రకృతి ఇచ్చిన బహుమతి అని ప్రధాని మోడీ కొనియాడారు. మణిపుర్ ను వేగంగా ప్రగతి పథంలో పయనింపజేస్తాం అని మణిపుర్ కోసం రూ.7 వేల కోట్ల ప్రాజెక్టులను ప్రారంభిస్తున్నామని తెలియజేశారు. మణిపుర్‌ను దేశంతో అనుసంధానం చేసే ప్రాజెక్టులు చేపడుతున్నామని, రైలు, రోడ్డు మార్గాల కోసం మణిపుర్ కు నిధులు కేటాయిస్తున్నామని అన్నారు. భారీ వర్షాల వల్ల హెలికాప్టర్ లో రావడం సాధ్యపడలేదని నరేంద్ర మోడీ తెలిపారు. రోడ్డు మార్గంలో మణిపుర్ కు వచ్చానని అన్నారు. చాలాకాం తరవాత మణిపుర్ లో మోడీ పర్యటించారు. మణిపుర్ లో అల్లర్ల బాధితులను పరామర్శించారు. ఇంఫాల్, చురాచంద్ పుర్ లో పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. మణిపుర్ లో అల్లర్ల బాధిత కుటుంబాల చిన్నారులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా మణిపుర్ బహిరంగ సభలో మాట్లాడారు. రోడ్డు మార్గంలో వచ్చేటప్పుడు తనకు తమరు పలికిన స్వాగతం మర్చిపోలేనని, మువ్వెన్నల జెండాలు చేతబట్టి తనకు ఘనంగా స్వాగతం పలికారని ఆనందాన్ని వ్యక్తం చేశారు. రూ. 8 వేల కోట్లతో జాతీయ రహదారుల పనులు వేగంగా కొనసాగుతున్నాయని, మణిపుర్ లో రైల్ కనెక్టివిటీ- భారీగా పెంచుతున్నామని మోడి పేర్కొన్నారు. భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోందని, త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించబోతుందని చెప్పారు. ప్రస్తుతం మణిపుర్ చేపడుతున్న ప్రాజెక్టులతో మౌలిక సదుపాయాలు, వైద్యసేవలు మెరుగవుతాయని, ఈశాన్య రాష్ట్రాల్లోదశాబ్దాలుగా అనేక వివాదాలు, ఉద్యమాలు ఉన్నాయని అన్నారు. ప్రస్తుతం ఈశాన్య రాష్ట్రాల్లో శాంతి నెలకొంటోందని, శాంతి స్థాపన ద్వారానే అభివృద్ధి సాధ్యమవుతుందని వెల్లడించారు.

పేజి 2లో ▶

## దేశాభివృద్ధిలో మిజోరం భాగస్వామ్యం కీలకం

•యువత ఇందులో భాగస్వామ్యం కావాలి
•మిజోరంలో రూ.9వేల కోట్లతో పలు అభివృద్ధి పనులు
•ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోడీ

2 లో

## జీఎస్టీ సంస్కరణలతో ఔషధాల ధరలు తగ్గింపు

•క్యాన్సర్ మందుల ధరలు తగ్గుదలతో ఊరట
•కార్లు, బైకుల ధరలు కూడా తగ్గిస్తూ ప్రకటనలు
•22 తరవాత సిమెంట్,నిర్మాణ సామాగ్రి ధరలు తగ్గుదల
•భారత ఆర్థికవ్యవస్థ 7.8శాతం వృద్ధిని సాధించిందన్న ప్రధాని మోడీ

2 లో




## రాహుల్ ప్రధాని కావడమే లక్ష్యంగా యూత్ కాంగ్రెస్ పని చేయాలి: మహేశ్‌కుమార్ గౌడ్

2 లో




# కృష్ణా జలాల్లో న్యాయమైన వాటా సాధించాల్సిందే: రేవంత్‌రెడ్డి




•తెలంగాణ ఖజానాను ఖాళీ చేసిన కేసీఆర్ కుటుంబం.. దోచుకున్న సొమ్ముకోసం లొల్లిపెట్టుకుంటునా్నరని విమర్శించారు మంత్రి వివేక్ వెంకటస్వామి.

తెలంగాణ ఖజానాను ఖాళీ చేసిన కేసీఆర్ కుటుంబం.. దోచుకున్న సొమ్ముకోసం లొల్లిపెట్టుకుంటున్నారని విమర్శించారు మంత్రి వివేక్ వెంకటస్వామి. మంచిర్యాల జిల్లా భీమారం మండలం కేంద్రంలో 134 మందితో కూడిన నూతన ముదిరాజ్ మహిళా సంఘం ఏర్పాటు చేసిన సందర్భంగా మహిళలకు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తో కలిసి ప్రొసీడింగ్స్ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామిని శాలువాతో సత్కరించారు మహిళా సంఘం సభ్యులు. పేజి 2లో ▶

నికర, మిగులు, వరద జలాల్లో ఒక్క చుక్క కూడా వదులుకోకూడదు.

రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేందుకు బలమైన వాదనలు వినిపించాలి.

కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టుల వివరాలను ట్రిబ్యునల్‌కు సమర్పించాలి.

ఆంధ్రప్రదేశ్ చేస్తున్న అక్రమ నీటి తరలింపును ఆధారాలతో సహా నివేదించాలి.



హైదరాబాద్: కృష్ణా జలాల్లో న్యాయమైన వాటాను సాధించి తీరాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. నికర, మిగులు, వరద జలాల్లో చుక్క నీరు కూడా వదులుకునేది లేదని స్పష్టం చేశారు. దిల్లీలో ఈ నెల 23 నుంచి 25 వరకు కృష్ణా జలవివాదాల ట్రిబ్యునల్‌లో విచారణ ఉన్న నేపథ్యంలో ట్రిబ్యునల్ ముందు వినిపించాల్సిన వాదనలపై నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు.

"కృష్ణా జలాల్లో తెలంగాణ నీటి వాటాను సాధించేలా పట్టుబట్టాలి. రాష్ట్ర ప్రయోజనాలను పరిరక్షించేందుకు బలమైన వాదనలు వినిపించాలి. కృష్ణా నదిపై ప్రాజెక్టుల వివరాలన్నీ ట్రిబ్యునల్ ముందుంచాలి. గతంలో పట్టించుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చింది. గత పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం దారుణంగా విఫలమైంది. కృష్ణా జలాల్లో వాటా సాధించడంలో కేసీఆర్ విఫలమయ్యారు. నీటి వాటాల విషయంలో కేసీఆర్ రాష్ట్రానికి తీరని ద్రోహం చేశారు. పాలమూరు, దిండి లాంటి ఎన్నో ప్రాజెక్టులను పెండింగ్‌లో పెట్టారు. కేసీఆర్ నిర్లక్ష్యం వల్ల కృష్ణా జలాలను ఏపీ తరలించుకుపోయింది. ఏపీ అక్రమ నీటి తరలింపును ఆధారాలతో సహా ట్రిబ్యునల్‌కు నివేదించాలి." అని రేవంత్‌రెడ్డి దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది వైద్యనాథన్, సీడబ్ల్యూసీ మాజీ ఛైర్మన్ వోహ్రా, ఇరిగేషన్‌శాఖ సలహాదారు ఆదిత్యనాథ్‌దాస్ పాల్గొన్నారు.

## 811 టీఎంసీల కృష్ణా జలాల్లో రాష్ట్రానికి 71శాతం డిమాండ్ చేస్తున్నాం: మంత్రి ఉత్తమ్



2 లో

## బోయిన్‌పల్లిలో మత్తుపదార్థాల తయారీ గుట్టురట్టు



2 లో

# సంపాదకీయం

## తగ్గింపులు సరే, క్షమాపణలు ఏవీ

కేంద్ర ప్రభుత్వానికి తుదకు వివేకోదయమయింది. ఈ సెప్టెంబర్ 3న ప్రభుత్వం విస్తృత శ్రేణి వస్తువులు, సేవలపై పన్ను (గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ %-జీఎస్టీ) రేట్లను హేతుబద్ధీకరించి, తగ్గించింది. శుభం. జీఎస్టీ ఇప్పుడు 'గుడ్ అండ్ సింపుల్ ట్యాక్స్' భావన (కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధించే అనేకానేక పరోక్ష పన్నులను ఒకే ఒక పన్నుగా సమైక్యపరచడం)కు సన్నిహితంగా ఉన్నది, సందేహం లేదు. పలువురు రాజకీయవేత్తలు, ఎంతో మంది వ్యాపారవేత్తలు, వివిధ సంస్థలు, (నాతో సహా) వ్యక్తులు ఎందరో వస్తు సేవల పన్ను అనేది గుడ్ అండ్ సింపుల్ ట్యాక్స్ వలే ఉండాలని ఎనిమిదేళ్లుగా వాదిస్తూ వస్తున్నారు.

ఆగస్టు 2016లో రాజ్యాంగ (122వ సవరణ) బిల్లుపై పార్లమెంటులో చర్చ జరిగినప్పుడు రాజ్యసభలో నేను ఆ చర్చలో పాల్గొన్నాను. ఆనాటి నా ప్రసంగంలోని కొన్ని భాగాలను ఉటంకించడం అప్రస్తుతం కాదు. నేను ఇలా అన్నాను: "వస్తు సేవల పన్నును అమలుపరచాలన్న ప్రభుత్వ సంకల్పాన్ని తొలుత అధికారికంగా ప్రకటించింది డాక్టర్ మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వమేనన్న వాస్తవాన్ని ఆర్థికమంత్రి అంగీకరించినందుకు నేను చాలా సంతోషిస్తున్నాను. 28, ఫిబ్రవరి 2005న ఆర్థికమంత్రి బడ్జెట్ ప్రసంగంలో జీఎస్టీని తొలిసారి ప్రకటించారు. వస్తుసేవల పన్నులో నాలుగు ప్రధాన అంశాలు ఉన్నాయి....." "122వ రాజ్యాంగ సవరణ బిల్లులోని చాలా ముఖ్యమైన విషయాన్ని తరచి చూడదలుచుకున్నాను. మనం పరోక్ష పన్ను గురించి వ్యవహరిస్తున్నామన్న విషయాన్ని దయచేసి మరచిపోవద్దు. పరోక్ష పన్ను అనేది నిర్వచనం రీత్యా ఒక తిరోగామి పన్ను (పన్ను మొదట్లో చెల్లించేది ఒకడు. అంతిమంగా దాని భారాన్ని భరించేది మరొకడు అయినప్పుడు ఆ పన్నును పరోక్ష పన్ను అంటారు). ఏ పరోక్ష పన్ను అయినా ధనికులు, పేదలు ఒకే రీతిలో చెల్లించేదిగా ఉంటుంది.... ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు నివేదిక ఇలా పేర్కొంది: 'అధికాదాయమున్న దేశాలలో సగటు జీఎస్టీ రేటు 16.8 శాతం. భారత్ లాంటి మార్కెట్ ఆధారిత ఆర్థిక వ్యవస్థగా ఇప్పుడిప్పుడే ఆవిర్భవిస్తున్న భారత్ లాంటి దేశాలలో సగటు జీఎస్టీ రేటు 14.1 శాతం'. ప్రపంచ వ్యాప్తంగా 190కు పైగా దేశాలలో జీఎస్టీ అనేది ఏదో ఒక రూపంలో ఉన్నది. అది సగటున 14.1 శాతం-16.8 శాతం మధ్య ఉన్నది...." "పన్నురేట్లను మనం తక్కువగా ఉంచవలసిన అవసరమున్నది. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వ, రాష్ట్ర ప్రభుత్వాల ప్రస్తుత ఆదాయాలను పరిరక్షించి తీరాలి... 'రెవెన్యూ తటస్థ రేటు' (రెవెన్యూ న్యూట్రల్ రేట్ – జీఎస్టీ వ్యవస్థలో సంస్కరణ తరువాత ప్రభుత్వం సేకరించే మొత్తం పన్ను ఆదాయం మునుపటిలాగే ఉండేందుకు దోహదం చేసే ప్రామాణిక పన్ను రేటు)ను కనుగొనడం ద్వారా ప్రభుత్వాల ప్రస్తుత ఆదాయాలను కాపాడాలి... ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులతో సహా ఆర్థిక నిపుణులతో సంప్రతింపులు, సమాలోచనలతో రెవెన్యూ తటస్థ రేటు 15 నుంచి 15.5 శాతంగా ఉండాలనే నిర్ణయానికి వచ్చారు. దరిమిలా ప్రామాణిక పన్నురేటు 18శాతంగా ఉండాలని సూచించారు. ప్రధాన ఆర్థిక సలహాదారు నివేదిక నుంచి గ్రహించే కాంగ్రెస్ పార్టీ ఆ ప్రామాణిక పన్ను రేటు 18 శాతం ఉండాలని కోరిందని నేను మళ్లీ చెప్పుతున్నాను..."“ప్రజల శ్రేయస్సు కోసం వారి తరఫున ఎవరో ఒకరు మాట్లాడాలి కదా. ప్రజల పేరిట నేను అడుగుతున్నాను: మీ ప్రభుత్వ ప్రధాన సలహాదారు సిఫారసు చేసిన రేటునే అమలుపరచండి. ప్రామాణిక పన్ను రేటు 18 శాతం మించకుండా చూడండి... ప్రామాణిక పన్ను రేటు 18 శాతంగా ఉంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయాలు పరిరక్షించబడతాయని ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు తన నివేదికలో సుసంగతంగా వాదించారు. అది ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచుతుంది. పన్ను చెల్లింపు ఎగవేతలను నివారిస్తుంది. దేశ ప్రజలందరికీ అంగీకారయోగ్యంగా ఉంటుంది. వస్తువులు, సేవలపై మీరు 24 నుంచి 26 శాతం పన్ను వసూలు చేయదలుచుకుంటే అసలు జీఎస్టీ బిల్లు తీసుకురావడమెందుకు?...." "అంతిమంగా ఒక పన్ను బిల్లులో పన్నురేటు ఎంత అనేది స్పష్టంగా పేర్కొనాలి. 70 శాతానికి పైగా వస్తువులు, సేవలకు వర్తించే జీఎస్టీ రేటు ఎట్టి పరిస్థితులలోను 18 శాతానికి మించకూడదని మా పార్టీ తరఫున, నా తరఫున గట్టిగా, స్పష్టంగా కోరుతున్నాను. అలాగే తక్కువ జీఎస్టీ రేటు, డీ మెరిట్ రేటు (వినియోగదారుల ఆరోగ్యానికి హానికరమైన, ప్రతికూల సామాజిక పరిణామాలకు కారణమయ్యే పొగాకు ఉత్పత్తులు, చక్కెర పానీయాలు మొదలైన వాటి వాడకాన్ని నిరుత్సాహపరిచేందుకు సదరు సరుకులపై ప్రభుత్వం విధించే ప్రత్యేక పన్ను రేటు)ను ఆ 18 శాతం ప్రామాణిక రేటు ప్రాతిపదికన నిర్ణయించాలి".

నేను ఈ వ్యాసంలో వ్యక్తం చేసిన అభిప్రాయాలనే 2016లో రాజ్యసభ చర్చలో వ్యక్తం చేశాను. వస్తుసేవల పన్ను రేట్లను హేతుబద్ధీకరించాలని, తగ్గించాలనే అభిప్రాయానికి ప్రభుత్వం వచ్చినందుకు నేను అమితంగా సంతోషిస్తున్నాను. అయితే వస్తుసేవల పన్నును అమలుపరచదలుచుకున్నప్పుడు ప్రామాణిక పన్నురేటు 18 శాతంగా మాత్రమే ఉంటే భారీ ఆదాయ నష్టం, ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వాలకు సంభవిస్తుందని మోదీ ప్రభుత్వం వాదించింది. అది నిష్కారణ భయం మాత్రమే. ఆదాయ నష్టం సాకుతో పన్నురేట్లను అధికంగా నిర్ణయించారు. జీఎస్టీ తాజా సంస్కరణలో రెండు శ్లాబ్‌ల రేట్లు 5 శాతం, 18 శాతంగా ఉన్నాయి! పన్ను రాబడిని పెంచుకునేందుకు ప్రభుత్వానికి అనేక మార్గాలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలు ఆదాయాన్ని కోల్పోతే, ఆ పరిస్థితిని చక్కదిద్దేందుకు సరైన మార్గం రాష్ట్రాలకు నష్టపరిహారం చెల్లించడమే.గత ఎనిమిది సంవత్సరాలుగా ప్రభుత్వం వినియోగదారుల నుంచి చివరి పైసాను సైతం రాబట్టుకునేందుకు జీఎస్టీ రేట్లను బహుళ రీతుల్లో నిర్ణయించి అమలుపరిచింది. ఆదాయాన్ని మరింతగా పెంపొందించుకోవడమే ప్రభుత్వ ప్రథమ లక్ష్యంగా ఉన్నది. వస్తుసేవల పన్ను అమలులోకి వచ్చిన మొదటి సంవత్సరం (జూలై 2017-మార్చి 2018) ప్రభుత్వం 11 లక్షల కోట్ల రూపాయలు వసూలుచేసుకున్నది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో జీఎస్టీ రాబడి 22 లక్షల కోట్ల రూపాయలుగా ఉన్నది. వినియోగదారులు కష్టపడి ఆర్జించుకున్న ప్రతి పైసాను వస్తుసేవల పన్ను ద్వారా ప్రభుత్వం లాగివేసుకున్నది. మరి జీఎస్టీని గబ్బర్ సింగ్ ట్యాక్స్ అని అపహసించడంలో ఆశ్చర్యమేమున్నది? అది సబబైన ఎగతాళి సుమా! వినియోగం తగ్గిపోవడానికి, గృహ రుణాల (ఇళ్లు, వాహనాల కొనుగోలు మొదలైనవాటికి కుటుంబాలు చేసే రుణాలు) భారం పెరిగిపోవడానికి ప్రధాన కారణాలలో ఒకటి జీఎస్టీ రేట్లు అధికంగా ఉండడమే. పన్నులు తగ్గించినప్పుడు వినియోగం పెరుగుతుంది – ఇది అర్థశాస్త్ర ప్రాథమిక పాఠం. టూత్‌పేస్ట్, తలనూనె, పెన్నులు, పెన్సిళ్లు, నోట్ పుస్తకాలు, ట్రాక్టర్లు, స్ప్రింకర్లు మొదలైన వాటిపై 5 శాతం జీఎస్టీ సమంజస నిర్ణయం. గత ఎనిమిది సంవత్సరాలుగా ఆ వినియోగ వస్తువులపై జీఎస్టీ అధికంగా ఎందుకు ఉన్నది? ఎనిమిది సంవత్సరాల పాటు ఈ దేశ ప్రజలు అత్యధిక పన్నులు ఎందుకు చెల్లించవలసివచ్చింది?వస్తుసేవల పన్ను రేట్ల తగ్గింపు ఆరంభం మాత్రమే. పన్నుల వ్యవస్థ ప్రజాహితంగా ఉండేందుకు ఇంకా ఎన్నో సంస్కరణలు చేపట్టవలసి ఉన్నది. ప్రభుత్వం తప్పక చేయవలసినవి: రాష్ట్రాలు, ఉత్పత్తిదారులు, వినియోగదారులను (తప్పనిసరైతే మరిన్ని మినహాయింపులతో) ఏకైక జీఎస్టీ రేటుకు సంసిద్ధపరచాలిబీ పన్నుల చట్టాలలోని అర్థంకాని పరిభాషను పరిహరించాలి. సరళమైన, సుబోధకమైన మాటలలో ఆ చట్టాలను పునర్లిఖించాలి, నియమనిబంధనలు సామాన్య వినియోగదారులకు సైతం అర్థమయ్యేలా సూటిగా స్పష్టంగా ఉండి తీరాలిబీ ట్యాక్స్ రిటర్న్‌ను పదే పదే ఫైల్ చేయవలసిన శ్రమను గణనీయంగా తగ్గించాలిబీ చట్టానికి అనుగుణంగా వ్యవహరించే ప్రక్రియను సరళీకరించాలి. చిన్న వ్యాపారస్తులు, దుకాణదారులకు చార్టర్డ్ అకౌంటెంట్ సేవలు అవసరం కాకూడదుబీ జీఎస్టీ చట్టాలను డీ-క్రిమినలైజ్ చేయాలి. అవి వ్యాపార, వర్తకాలకు సంబంధించిన పౌరచట్టాలు అనే వాస్తవాన్ని విస్మరించకూడదు. చట్టాలకు విరుద్ధంగా వ్యవహరించిన వారికి విధించే శిక్షను సహేతుకమైన జరిమానాలతో సరిపెట్టాలి. ఉత్పత్తిదారులు, వ్యాపారులు ఆర్థిక వ్యవస్థకు కీలకమైనవారని, సమాజ శత్రువులు కారనే యథార్థాన్ని పన్ను వసూలు అధికారుల మనసుల్లో నెలకొల్పాలి.

# దేశాభివృద్ధిలో మిజోరం భాగస్వామ్యం కీలకం



మొదటిపేజీ తరువాయి

దేశాభివృద్ధిలో మిజోరం భాగస్వామ్యం కీలకమని ప్రధాని మోడీ తెలిపారు. కొండమార్గంలో రైలు మార్గం కష్టతరంలో కూడుకున్నదని, సవాల్‌తో కూడిన నిర్మాణాలు అద్భుతమని కొనియాడారు. మిజోరంలో రూ.9 వేల కోట్ల అభివృద్ధి పనులకు ప్రధాని నరేంద్ర మోడీ శ్రీకారం చుట్టారు. వర్చువల్‌గా అభివృద్ధి పనులను పిఎం మోడీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. ఈ రైల్వే లైన్లు భారతీయ రైల్వే నెట్‌వర్క్‌తో అనుసంధానమవుతాయని, పర్యాటక రంగంతో ఉపాధి అవకాశాలు మెరుగుపడే అవకాశం ఉందని తెలియజేశారు. ఏ రాష్ట్రాభివృద్ధికైనా రోడ్డు, రైల్వే, పోరు కనెక్టివిటీ– ముఖ్యమని స్పష్టం చేశారు. మిజోరం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, వేగవంతమైన దేశాభివృద్ధిలో మిజోరం యువత భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. మిజోరంలో రవాణా సౌకర్యాలు పెంచామని, నూతన రైళ్ల ప్రారంభోత్సవంతో రవాణా సౌకర్యాలు మెరుగుపడుతాయని మోడీ వివరించారు. కష్టతరమైన కొండ ప్రాంతాల్లో రైల్వే సౌకర్యం సంతోషకరమైన విషయమన్నారు. ఇంజినీర్ల నైపుణ్యం, కార్మికుల స్ఫూర్తి అసాధ్యాన్ని సుసాధ్యం చేసిందని ప్రశంసించారు. కఠినమైన భూభాగంతో అనేక సవాళ్లను అధిగమించి నిర్మాణం పూర్తి చేశారని మోడీ కొనియాడారు.

# జిఎస్టీ సంస్కరణలతో ఔషధాల ధరలు తగ్గింపు

మొదటిపేజీ తరువాయి

తమ ప్రభుత్వం చేపట్టిన జీఎస్టీ సవరణలతో క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధుల మందుల ధరలు తగ్గుతాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. కార్లు, బైక్‌లను తయారుచేసే అనేక కంపెనీలు ఇప్పటికే ధరలను తగ్గించాయని.. సెప్టెంబర్ 22 తర్వాత సిమెంట్ నిర్మాణ సామగ్రి కూడా చౌకగా మారతాయని ప్రధాని తెలిపారు. వివిధ హోటళ్లపై జీఎస్టీని 5 శాతం తగ్గించడం వల్ల పర్యాటకులకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఈవిధంగా దేశంలోని అనేక కుటుంబాలపై భారం తగ్గించామంటూ వ్యాఖ్యానించారు. 2025-26 మొదటి త్రైమాసికంలో భారత ఆర్థికవ్యవస్థ 7.8శాతం వృద్ధిని సాధించిందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రస్తుతం భారత్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థికవ్యవస్థగా ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోందన్నారు. మేక్ ఇన్ ఇండియా ద్వారా దేశం చేసే ఎగుమతుల్లో వృద్ధిని సాధించగలిగామన్నారు. కాంగ్రెస్ హయాంలో ఔషధాలు, బీమాపై అధిక పన్నులు విధించారని ప్రధాని మండిపడ్డారు. 2014కి ముందు టూత్‌పేస్ట్, సబ్బు, నూనె వంటి రోజువారీ నిత్యావసర వస్తువులకు కూడా 27 శాతం పన్ను విధించేవారు. నేడు వీటిపై కేవలం 5శాతం జీఎస్టీ మాత్రమే వర్తిస్తుంది. కాంగ్రెస్ హయాంలో ఔషధాలు, బీమాపై అధిక పన్నులు విధించడం వల్ల సాధారణ కుటుంబాలకు ఆరోగ్య సంరక్షణ చాలా ఖరీదైనదిగా మారిందని అన్నారు. మన ఆర్థికవ్యవస్థ తయారీ రంగం వృద్ధి మన జాతీయ భద్రతకు చాలా ముఖ్యమైనదన్నారు. ప్రజల సాధికారత ద్వారానే భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారుతుంద న్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో.. ఉగ్రవాదాన్ని పెంచి, పోషిస్తున్న వారికి భారత సైన్యం ఎలా బుద్ధి చెప్పిందో ఆపరేషన్ సిందూర్ సమయంలో ప్రపంచం మొత్తం చూసిందని ప్రధాని మోదీ అన్నారు. మన సాయుధ దళాలు చూపిన తెగువకు దేశం మొత్తం గర్వపడిందన్నారు. ఈ ఆపరేషన్‌లో స్వదేశీ ఆయుధాలే మన దేశాన్ని రక్షించడంలో ముఖ్య పాత్ర పోషించాయన్నారు. మణిపుర్‌లో జాతుల మధ్య హింస చెలరేగిన రెండు సంవత్సరాల తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ తొలిసారి ఆ రాష్ట్రంలో నేడు పర్యటించనున్నారు. దీనికి ముందు మిజోరంలో పలు అభివృద్ధి పనులకు ప్రధాని మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. బైరాబి-సైరాంగ్ రైల్వేలైన్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మిజోరం నుంచి చురాచంద్‌పుర్ చేరుకుంటారు.

# దేశానికి మణిహారం మణిపూర్

మొదటిపేజీ తరువాయి

శాంతి స్థాపన ద్వారా తమ భావితరాల భవిష్యత్తు బావుంటుదని, మణిపుర్ ప్రజల వెంట భారత ప్రభుత్వం ఉందని మోడి స్పష్టం చేశారు. జాతుల మధ్య ఘర్షణలకు కేంద్రమైన చురాచంద్‌పుర్ జిల్లాకు చేరుకున్నారు. అక్కడ బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. హింసాత్మక ఘటనల వల్ల నిరాశ్రయులైన వారితో మాట్లాడారు. 2023లో ఈ ఘర్షణలు చోటుచేసుకోగా.. రెండేళ్ల తర్వాత మోడీ ఆ రాష్ట్రానికి వెళ్లారు. శరణార్థి శిబిరాల్లో ఉన్న చిన్నారులను పలకరించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటాన్ని ఓ చిన్నారి కానుకగా ఇచ్చింది. రాష్ట్రంలో శాంతిభద్రతలను పునరుద్ధరించేందుకు కేంద్రం కట్టుబడి ఉందని వారికి హామీ ఇచ్చారు. తర్వాత స్థానికంగా ఏర్పాటు-చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. 'మణిపుర్ ప్రకృతి ప్రసాదించిన కానుక. ఈ రాష్ట్ర ప్రజలకు తలవంచి నమస్కరిస్తున్నాను. ఇది సాహసవంతులు పుట్టిన నేల. మణిపుర్ లో కొండలు చాలా అందంగా ఉన్నాయి. పేరులో ఉన్న మణికి అర్థం.. ఈశాన్య రత్నమని. ఈ రాష్ట్రాన్ని మళ్లీ అభివృద్ధి పథంలోకి తీసుకువస్తాం. ఇలాంటి అందమైన ప్రాంతంలో హింస చెలరేగింది. కొత్త ఉషస్సు ప్రారంభం కానుంది. ప్రజలు శాంతి మార్గాన్ని ఎంచుకున్నారు. శాంతి చర్చలు మొదలయ్యాయి. నేను మీతో ఉన్నాను. కేంద్రం మీ వెంటే ఉంటు-ందని హామీ ఇస్తున్నాను. ఈ రాష్ట్రం శాంతికి చిహ్నంగా మారాలని కోరుకుంటున్నాను అని మోదీ అన్నారు. వర్షాన్ని కూడా లెక్క చేయకుండా సభకు వచ్చిన వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.మెయిటీలకు రిజర్వేషన్లు ఇవ్వాలన్న ప్రతిపాదనపై వచ్చిన వ్యతిరేకత 2023లో మణిపుర్‌ను హింసాత్మకంగా మార్చిన సంగతి తెలిసిందే. వారికి రిజర్వేషన్లు ఇవ్వొద్దని ఆదివాసీ తెగలు డిమాండ్ చేశాయి. మెయిటీ-లకు రిజర్వేషన్లు దక్కితే వారు తమ అటవీ ప్రాంతాల్లో ఆవాసాలు ఏర్పాటు- చేసుకోవడంతో పాటు- తమకు రావాల్సిన ఉద్యోగాల్లో వాటా తగ్గిపోతుందని వారు ఆందోళన చెందారు. ఆ నిరసనలకు చురాచంద్‌పుర్ కేంద్రమైంది. రాష్ట్రంలోని పలు అటవీ ప్రాంతాలను రిజర్వ్ ప్రాంతాలుగా ప్రకటించడంతో కొండలపై నివాసమున్నవారు ఆగ్రహం వ్యక్తంచేశారు. కనీసం పునరావాసం కల్పించ కుండా తమను తరలించడంపై నిరసన వ్యక్తంచేశారు. దీనికితోడు రిజర్వేషన్ల అంశం తెర పైకి రావడంతో నిరసనలు ఘర్షణ రూపం దాల్చాయి. ఆ క్రమంలో అమానవీయ ఘటనలు చోటుచేసుకున్నాయి. మణిపుర్‌లో చెలరేగిన అల్లర్లలో 250 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా కొన్ని వేల మంది నిరాశ్రయు లయ్యారు. పలువురి ఆస్తులు ధ్వంసమయ్యాయి. ఈ హింసపై సుప్రీంకోర్టు జోక్యం చేసుకుంది. అప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న బీరెన్‌సింగ్ ఈ ఏడాది తన పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే.జాతుల మధ్య హింస చెలరేగిన రెండు సంవత్సరాల తర్వాత శనివారం వెళ్లారు. ఈ పర్యటన దృష్ట్యా మణిపుర్ ప్రభుత్వం కట్టు-దిట్టమైన భద్రతా ఏర్పాట్లు- చేసింది. మిజోరం, మణిపుర్, అస్సాం, పశ్చిమ బెంగాల్, బిహార్‌లలో మోదీ పర్యటన సాగనుంది.

## 811 టీఎంసీల కృష్ణా జలాల్లో రాష్ట్రానికి 71శాతం డిమాండ్ చేస్తున్నాం: మంత్రి ఉత్తమ్

మొదటిపేజీ తరువాయి



హైదరాబాద్: ఈ నెల 23 నుంచి కృష్ణా ట్రైబ్యునల్ విచారణ దృష్ట్యా.. నీటిపారుదల రంగ నిపుణులు, న్యాయ నిపుణులతో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది వైద్యనాథన్‌తో పాటు, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. కృష్ణా జలాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. 811 టీఎంసీల కృష్ణా జలాల్లో రాష్ట్రానికి 71శాతం డిమాండ్ చేస్తున్నామన్నారు. న్యాయంగా రావాల్సిన నీటివాటాను సాధిస్తామని తెలిపారు. ట్రైబ్యునల్ ముందు బలమైన వాదనలు వినిపిస్తామని చెప్పారు. తాగు, సాగునీటితో సహా పరిశ్రమలకు నీటి వినియోగానికి చర్యలు తీసుకుంటామన్నారు. ట్రైబ్యునల్ విచారణ సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి దిల్లీకి వచ్చి సమీక్షిస్తారని తెలిపారు.

### గత పాలకుల నిర్లక్ష్యమే కారణం..

తెలంగాణలో నిర్మిస్తున్న ప్రాజెక్టులకు 65 శాతం మేర నీటి కేటాయింపులు ఉండాల్సిందేనని అన్నారు. పెరుగుతున్న అవసరాలకు తగ్గట్లుగా నీటి కేటాయింపులు ఉండాలని అందుకు అనుగుణంగా తాజా సమాచారాన్ని ట్రైబ్యునల్‌కు సమర్పించామన్న ఉత్తమ్... ఎట్టిపరిస్థితుల్లోనూ ఈ అవకాశాన్ని జారవిడుచుకోబోమని పునరుద్ఘాటించారు. జూన్, జూలై మాసాల్లో 80 టీఎంసీల నీటిని అందుబాటులో ఉంచడంతో పాటు ఆపరేషన్ ప్రోటోకాల్ అనుసరించి నీటిని వినియోగించుకునే స్వేచ్ఛ తెలంగాణకు ఉండేలా ట్రైబ్యునల్ ముందు ఉంచుతామని తెలిపారు. ఏపీ అక్రమంగా వినియోగిస్తున్న 291 టీఎంసీల నీటి ఉదంతం వెలుగులోకి వచ్చినందున... ఆ నీటిని పునర్విభజన చేయాల్సిందేనని మంత్రి డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రాజెక్టులకు ఏపీ అడ్డుపడుతోందని... రాష్ట్ర హక్కులను కూడా ట్రైబ్యునల్ ఎదుట జరిగే వాదనల్లో వినిపిస్తామని చెప్పారు. ప్రతిపాదిత ప్రాజెక్టుల అంశాలతో కూడిన ప్రత్యేక జీఓను విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని తెలిపారు. ప్రాజెక్టులు పూర్తి చేయకపోవడం వల్లే కృష్ణా జలాలను తెలంగాణ వినియోగించుకోలేక పోయిందని భారత రాష్ట్ర సమితి నేతలపై ఉత్తమ్ మండిపడ్డారు. గత పాలకుల ఉదాసీనత కారణంగా ఏపీ అక్రమంగా నీటిని తరలించుకుపోయి ప్రయోజనం పొందిందని విమర్శించారు.

## ఆ ముగ్గురు దోచుకున్న సొమ్ము కోసం లొల్లి పెట్టుకుంటున్నరు : మంత్రి వివేక్ వెంకటస్వామి

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా మాట్లాడిన వివేక్ వెంకటస్వామి..గత ప్రభుత్వ హయాంలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు..కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుంది. తెలంగాణ ఖజానాను ఖాళీ చేసిన కేసీఆర్ ఫ్యామిలో దోచుకున్న డబ్బు కోసం లొల్లి పెట్టుకుంటున్నారు. అన్నా, చెల్లి, బావ ముగ్గురు కోట్లాడుకుంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మర్చిపోవద్దు..నిరుపేదల కోసం ఆలోచించే పార్టీ కాంగ్రెస్ పార్టీ. మీకు ఏ సమస్య వచ్చినా ఎల్లపుడూ అందుబాటులో ఉంటా. కాక స్ఫూర్తి తో ప్రజా సేవే చేసేందుకే నేను ఉన్నా.

మహిళా సంఘాలు మహిళల ఆర్థికాభివృద్ధికి ఉపయోగపడతాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి.మహిళలందరికీ ప్రభుత్వం మంచి అవకాశం కల్పించింది. ముదిరాజ్ లకు సబ్సిడీ ద్వారా మత్స్యశాఖ వాహనాలు అందిస్తుంది.వాటిని సద్వినియోగం చేసుకోవాలి. ఏ పని అయినా క్రమ శిక్షణతో చేయాలి.అప్పుడే విజయం సాధించడం సాధ్యం అవుతుంది.మహిళలు బిజినెస్ లో రోల్ మోడల్ గా నిలవాలి.21 వేల కోట్లు మహిళా సంఘాలకు కేటాయించింది. నిరుపేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తుంది. ఇళ్లు కట్టుకున్న దర్వాత ఇంట్లో కరెంట్ ఫ్రీ గా ఇస్తుంది. మహిళలకు ఫ్రీ బస్సు కల్పిస్తుంది. అని వివేక్ వెంకటస్వామి అన్నారు.

## బోయిన్‌పల్లిలో మత్తుపదార్థాల తయారీ గుట్టురట్టు

మొదటిపేజీ తరువాయి

బోయిన్‌పల్లి: హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లిలో మత్తు పదార్థాల తయారీ గుట్టు రట్టయింది. స్థానిక పాత పాఠశాల భవనంలో ఆల్ఫాజోలం అనే మత్తుపదార్థాన్ని తయారు చేస్తున్న ముఠాను ఈగల్ టీమ్ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది. మత్తుమందు తరలిస్తుండగా.. నలుగురు సభ్యుల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. పాఠశాల నుంచే వీరంతా దందా కొనసాగిస్తున్నారన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## రాహుల్ ప్రధాని కావడమే లక్ష్యంగా యూత్ కాంగ్రెస్ పని చేయాలి: మహేశ్‌కుమార్ గౌడ్

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: భాజపా, భారత రాష్ట్ర సమితి పార్టీలు మానసికంగా ఒక్కటయ్యాయని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. గాంధీభవన్‌లో నిర్వహించిన యూత్‌కాంగ్రెస్ స్థాయి విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై సీబీఐ విచారణ నుంచి రక్షించుకునేందుకు భాజపా పెద్దల దగ్గర కేసీఆర్ మోకరిల్లారని ఆయన ఆరోపించారు. ఎమ్మెల్యేల ఫిరాయింపు స్పీకర్ పరిధిలోని అంశంగా మహేశ్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. రాహుల్ గాంధీ ప్రధాని అవ్వడమే లక్ష్యంగా యూత్ కాంగ్రెస్ నాయకులు పని చేయాలని దిశా నిర్దేశించారు.

# మనకెందుకులే అనుకోకుండా తమవంతు బాధ్యతగా వ్యవహారించాలి

- చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల గురించి తెలిస్తే వెంటనే సమాచారం అందించండి
- గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్
- రాం నగర్, సీతానగర్, మల్లికార్జున్ నగర్, కృష్ణ, లెనిన్ నగర్ లో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం




**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని సెప్టెంబర్ 13:** రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా, పెద్దపల్లి డీసీపీ పి. కరుణాకర్ ఆదేశాల మేరకు గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్ పర్యవేక్షణలో గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో శనివారం రాంనగర్, సీతానగర్, మల్లికార్జున్ నగర్, కృష్ణ, లెనిన్ నగర్, 2ఏ మోరి, ఆర్సీఓ క్లబ్ ప్రాంతలలో 80 మంది సిబ్బంది తో 08 టీమ్ లను ఏర్పాటు చేసి మధ్యాహ్నం సమయంలో ఏకకాలంలో ఆకస్మికంగా కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం ను నిర్వహించి ఈ ప్రాంతం లలో ఇండ్లలో సోదాలు చేసి అనుమానాస్పద వ్యక్తుల చెక్ చేయడం జరిగిందని, సరిగ్గా పత్రాలు లేని వాహనాలు సీజ్ చేసి జరిమానాను విధించడం అదేవిదంగా ఎలాంటి ధ్రువపత్రాలు లేని వాహనాలు సిజ్ చేశారు. అనంతరం అక్కడి స్థానికులతో ఏసీపీ, సీఐ మాట్లాడి ఆ ఆ ప్రాంతంలో ఉన్న సమస్యల గురించి తెలుసుకొని అనంతరం సమావేశాన్ని ఏర్పాటు చేసి గోదావరిఖని ఏసీపీ పలు సూచనలు, హెచ్చరికలు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఇతర రాష్టాల, ప్రాంతాల నుండి వచ్చి కూలి పని చేసేవారు ఎక్కువ మంది మీమీ ప్రాంతం లో నివాసం ఉంటున్నారు. కిరాయికి ఇండ్లు ఇచ్చే వారు వారి పూర్తి వివరాలు, ఎక్కడ నుండి వచ్చారు, గతం లో ఎక్కడ ఉన్నారు, వారి కుటుంబ సభ్యుల వివరాలు, ఆధార్ వివరాలు తెలుసుకోవాలి అన్నారు. కొంతమంది మద్యం, గంజాయి వంటికి అలవాటు పడి, మీ ప్రాంతం యువత ను చెడు అలవాట్లకు బానిసలుగా మార్చే అవకాశం కలదని,
గతంలో ఇతర రాష్ట్రాల నుంచి గంజాయి అక్రమ రవాణా చేసిన వారిపై కేసులు నమోదు చేయడం జరిగిందని, వారితో పాటు గంజాయి అమ్మే వారిపై, సేవించే వారిపై కూడా కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. యువత, ప్రజలు మీమీ చుట్టుపక్కల గాని మీ కాలనీ లో కానీ ఎవరైన గంజాయి లేదా మత్తు పదార్థాల విక్రయాలు, రవాణా, వినియోగం లాంటి చర్యలకు పాల్పడినట్లుగా గమనిస్తే, వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. మీమీ కుటుంబంలో ఉన్న పిల్లల పై తల్లితండ్రులు, పెద్దలు దృష్టి సారించాలని వారి యొక్క ప్రవర్తన, స్నేహాలు, కదలికలు వారు ఫోన్ లలో చెడు వీడియోలు చూస్తున్నారా, ఏమైనా ఆన్లైన్ గేమ్స్ ఆడుతున్నారా గమనించాలని, వారి అలవాట్లపై దృష్టి సారించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్, రోడ్ సేఫ్టీ నిబంధనలు పాటించాలని, తమ తమ వాహనాలకు అన్ని ధ్రువీకరణ పత్రాలను ఉంచుకోవాలని, ముఖ్యంగా యువత రేషన్ డ్రైవింగ్, త్రిబుల్ డ్రైవింగ్ చేయడం, లైసెన్స్ లేక లేకుండా డ్రైవింగ్ చేయడం మైనర్ డ్రైవింగ్ చేయడం చేస్తు ప్రమాదాల బారినపడి ప్రాణాలు కోల్పోవడం జరుగుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలకు మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదు. వారి వలన ప్రమాదం జరిగి ఎవరికైనా ఇబ్బంది కలిగితే బైక్ యజమానులపై కూడా కేసులు నమోదు చేయడం జరుగుతుందని, తమ ప్రాంతంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. చట్ట వ్యతిరేకమైన అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేయడమైనదని తెలిపారు. యువత బాధ్యతాయుతంగా వివరిస్తూ మనకెందుకులే అనుకోకుండా సమాజ భద్రతలో తమవంతు బాధ్యతగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలియజేసారు. సోషల్ మీడియాలో వస్తున్న అనేక వెబ్సైట్ల ద్వారా సైబర్ నేరగాళ్లు నేరాలకు పాల్పడుతున్నారని, సైబర్ నేరాలు ఎక్కువ అవుతుండడంతో రామగుండం సైబర్ క్రైమ్స్ పోలీసులు సైబర్ నేరాలపై, గంజాయి, డ్రగ్స్ పై అవగాహన కల్పిస్తున్నాం అని ఏసీపీ గారు అన్నారు. కాలనీవాసులందరూ కలిసి తమ తమ ప్రదేశంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని నేరాలు నియంత్రణకు పోలీస్ వారికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్లు ఇంద్రసేన రెడ్డి, రవీందర్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేశ్వర్ రావు, ఎస్సై రమేష్, భూమేష్, అనూష, ఎస్ఐలు నవీన్, రాజేష్,వన్ టౌన్ పోలీస్ సిబ్బంది, సిబ్బంది పాల్గొన్నారు.
19

## రాష్ట్రవ్యాప్తంగా బీసీలు ఒకటి కావాలి కటకం నర్సింగరావు

**కరపత్రం ప్రతినిధి దినపత్రిక మెదక్ నర్సాపూర్.**



ఈరోజు మన ఆలోచన సాధన సమితి నియోజకవర్గాల పర్యటనలో భాగంగామెదక్ జిల్లానర్సాపూర్ నియోజకవర్గ కేంద్రంలో వివిధ బీసీ కులాల సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించిన మన ఆలోచన సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ కటకం నర్సింగ్ రావు మన ఆలోచన సాధన సమితిని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించే క్రమంలో ఈ యొక్క సమావేశం నిర్వహించడం జరిగింది. త్వరలో నర్సాపూర్ నియోజకవర్గ కేంద్రంలో ఉన్నటువంటి అన్ని కుల సంఘాల ప్రతినిధులతో ఒక సమావేశం ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా కటకం నర్సింగ్ రావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవాధ్యక్షులు నరసింహ గౌడ్ రాష్ట్ర అధికార ప్రతినిధి మంగిళిపల్లి శంకర్ గంగపుత్ర రాష్ట్ర ప్రచార కార్యదర్శి పెద్దవూర బ్రహ్మయ్య రజక రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దువ్వల శ్రీకాంత్ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు నరేంద్ర చారి, సదానంద చారి, దయానంద చారి, పద్మశాలి సంఘం నాయకులు జయప్రకాష్ , నక్కా ప్రభాకర్ పద్మనాభం , యాదవ సంఘం నాయకులు బుశ్చేష్ యాదవ్

## 'దేవుడు స్థలాన్ని చూపించాడు. వెళ్తున్న

**కరపత్రం ప్రతినిధి సెప్టెంబర్ 13. యాదయ్య రిపోర్టర్.**



యువకుడు అదృశ్యమైన ఘటన పటాన్చెరులో చోటు చేసుకుంది. ఇస్నాపూర్ మున్సిపాలిటీ ఇందిరమ్మ కాలనీకి చెందిన వీరేశ్ (22) గురువారం డ్యూటీకి వెళు_న్నానని వెళ్లి తిరిగి రాలేదు. 'నాకు కలలో దేవుడు ఒక స్థలాన్ని చూపించాడు అక్కడికి వెళ్తున్నాను' అని అన్నకు మెసేజ్ పెట్టాడు. వెంటనే ఫోన్ చేయగా స్విచ్ఎఫ్ వచ్చింది. తమ్ముడి మిస్సింగ్ పై అన్న పటాన్చెరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## చెత్త ను బహిరంగ ప్రదేశంలో వేయకండి.



**కరపత్రం ప్రతినిధి సెప్టెంబర్ 13.**
వార్డ్ నెంబర్ 3 క్రింది బజార్ వైకుంఠ పురం వెళ్లే దారిలో నిత్యం వేల మంది ప్రయాణాలు చేస్తుంటారు. ఇంటి నుండి బయట కి వచ్చేటప్పుడు ఇంట్లో చెత్త మొత్తం కవర్లు లో నింపి ఆ మార్గంలో పారావేస్తూ ఉంటారు. దీని వల్ల ఆ దారి లో వెళ్లే వారు దుర్గాందము తో ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోజు మునిసిపల్ సిబ్బంది రోజంతా కష్టపడి ఆ చెత్త మొత్తం తీయడం జరిగింది, అదే స్థలం లో మొక్కలు నాటారు ఇక నైనా బహిరంగ ప్రదేశంలో చెత్త వేయకుండా మునిసిపల్ సిబ్బంది కి అందించాలని ప్రజలని మునిసిపల్ కమీషనర్ విజ్ఞప్తి చేశారు పర్యావరణం కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత. కావున ప్రజలు తమ వంతు బాధ్యత గా చెత్త ని బహిరంగ ప్రదేశాలలో వేయవద్దని కోరనైనది. అందువలన దయచేసి ఎవరు కూడా చెత్తను బయట వేయకుండా మీ వార్డ్ లోకి వచ్చిన ఆటో కి తడి చెత్త పొడి చెత్త వేరు చేసి ఇవ్వగలరని మున్సిపల్ కమిషనర్ తెలిపారు

## అల్ఫోర్స్ ఇ-టెక్నో లో ఘనంగా హిందీ దివస్ వేడుకలు , హిందీ ఉపాధ్యాయులకు ఘన సన్మానం.



**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ సెప్టెంబర్ 13**
అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో ముందస్తు జాతీయ హిందీ దివస్ ను పురస్కరించుకొని ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక వేడుకలకు హాజరై మాట్లాడుతూ హిందీ భాష ద్వారా ఎన్నో అవకాశాలు ఉంటాయని తెలుపుతూ హిందీ భాష మాట్లాడడం వారికి ఉపాధి అవకాశాలు చాలా ఉంటాయని , హిందీ భాష ద్వారా మన దేశంలోనే కాకుండా ఇతర దేశాలలో సైతం ఈ భాష ద్వారా పలు అవకాశాలను పొందగలుగుతామని అభిప్రాయపడ్డారు. హిందీ భాషలో ఉన్న మాధుర్యం చాలా గొప్పనైనదని ప్రతి ఒక్కరూ హిందీ భాషను అలవాటు చేసుకోవాలని , భావ ప్రసార పద్ధతులను పెంపొందించుకోవచ్చని చెప్పారు. పర్షియన్, అరబిక్, సంస్కృతిలోని, అనేక పదాలు హిందీలో ఉన్నాయని అదే విధంగా భారత ఉపఖండంలో అత్యధికంగా మాట్లాడే భాషలలో హిందీ భాష ఒకటి అని గుర్తు చేశారు. మన భారతదేశంలో ఎక్కువ మంది మాట్లాడే ముఖ్యమైన భాషలలో హిందీ భాష ఒకటనీ, హిందీ భాష అభివృద్ధికి కృషి చేస్తూ విద్యార్థుల్లో హిందీ భాష పట్ల మక్కువ పెంచుతున్న హిందీ ఉపాధ్యాయులను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆలపించినటువంటి పలు హిందీ రచనలు మంత్రముగ్ధులు చేశాయి ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎంపీ ఆర్ కృష్ణయ్య జన్మదిన వేడుకలు

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ సెప్టెంబర్ 13**



బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య జన్మదిన పురస్కరించుకొని తెలంగాణ చౌక్లో ఆ సంఘం నాయకులు కేక్ కట్ చేసి ఆర్ కృష్ణయ్య జన్మదిన వేడుకలు నిర్వహించారు. బిసి యువజన సంఘం జిల్లా అధ్యక్షులు నర్సింగోజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో కరీంనగర్ తెలంగాణ చౌక్ లో ఆర్ కృష్ణయ్య జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ చారి మాట్లాడుతూ ఆర్ కృష్ణయ్య గత 50 సంవత్సరాలుగా బీసీల రాజ్యాధికారమే అంతిమ లక్ష్యంగా పోరాడుతున్నారన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ ఆంధ్రప్రదేశ్ లో అమలవుతున్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ ఉదాహరణ,గత ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువచ్చి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ఐదు రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి ఫీజు రియంబర్స్మెంట్ స్కీమ్ ని తీసుకువచ్చిన ఘనత ఆర్.కృష్ణయ్య దని కొనియాడారు. ఎన్నో ఉద్యమాల ద్వారా ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకొచ్చి రెండు వేలకు పైగా జీవోలు సాధించిన ఘనత కూడా ఆయనకే సొంతం అన్నారు. నిత్యం పేద ప్రజల అభ్యున్నతి కోసం పాటుపడే వ్యక్తి ఆర్ కృష్ణయ్య అని, భగవంతుడు ఆయనకు నిండు నూరేళ్లు ఆయుఆరోగ్యాలతో ఉండాలని ప్రజలకి మరింత సేవలు అందించాలని ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ గున్నాల కన్నాంబ, యూత్ ప్రధాన కార్యదర్శి పెద్ది శ్రీనివాస్, సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు బెల్లం నరేందర్,జిల్లా కార్యదర్శి నరాల శ్రీకాంత్, సూరజ్, రవి కుమార్, అశ్విత్ తదితరులు పాల్గొన్నారు.

## టీబీజికెఎస్ జీడీకే 1 ఇంక్లైన్ ఫిట్ సెక్రటరీగా కానుగంటి మురళీకృష్ణ




**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని సెప్టెంబర్ 13:** తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆర్జీ వన్ ఏరియా 1 ఇంక్లైన్ ఫిట్ సెక్రటరీగా కానుగంటి మురళీకృష్ణను అసిస్టెంట్ పిట్ సెక్రటరీగా ప్రదీప్ ని ఆర్జీ 1 ఉపాధ్యక్షులు వడ్డేపల్లి శంకర్ నియమించారు. ఈ మేరకు గోదావరిఖనిలోని టీబీజీకేస్ కేంద్ర కార్యాలయంలో జరిగిన జీడికే వన్ ఇంక్లైన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నూనె కొమురయ్య మాట్లాడుతూ గతంలో టిఆర్ఎస్, టీబిజికెస్ హయాంలో 19,000 మందికి కారుణ్య నియమకాల ద్వారా ఉద్యోగాలు లభించాయని, ప్రస్తుతం మెడికల్ బోర్డు ఎత్తివేసి కుట్ర జరుగుతుందని, గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు సమస్యల పరిష్కారంలో విఫలమయ్యాయని, పెర్కొన్నారు కార్మికులందరూ కలిసి పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టీబీజీకేఎస్ అదికార ప్రతినిధి పర్లపల్లి రవి, కోశాధికారి చెల్పూరి సతీష్, జనగామ మల్లేష్, వాసర్ల జోసెఫ్, పులిపాక శంకర్, పల్లె సురెందర్, బొమ్మ రాజశేఖర్, కనకవ్ రాజయ్య, గర్నెల్లి చంద్రయ్య, పంబాల నాగరాజు, దొడ్డి శరత్ బాబు, శుద్ధ శ్రీనివాస్, సంఘ స్వామి, సుతారి రాజేందర్, కుక్కల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## బ్యాండ్ మోత గుది బండ..

- పెళ్లిళ్ల సమయంలో అసోసియేషన్
- డబుల్ రేట్ల వసూలు
- పనిచేయకున్నా ఆఫీసులో కూర్చొని జీతం

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని సెప్టెంబర్ 13:**



పెళ్లంటే అందరికీ గుర్తుండి పోయేలా చేస్తుంటారు.. ఎంత ఖర్చు అయినా వెనుకాడకుండా పెడుతుంటారు.. వారిని ఆసరాగా చేసుకొని అసోసియేషన్ ఏర్పాటుచేసి తమకు నచ్చినంత ఇస్తేనే బ్యాండు పంపిస్తామంటూ భాజాప్తున చెప్తున్నారు. అసోసియేషన్ నుండి చిట్టి చినిగితేనే పెళ్లి వారింటికి వెళ్లాలి. ఎవరైనా అసోసియేషన్ కాదని తక్కువ రేట్ కు బుక్ చేసుకుంటే ఇక అంతే.. వీరు ఆఫీసులోనే కూర్చుంటారు మీరు చెప్పిందే వేదం. మీరు బ్యాండు కొట్టడానికి వెళ్లరు. వచ్చేదాంట్లో ఎంతో కొంత తీసుకొని వారు తమ ఖర్చులకు జీతంగా తీసుకుంటారు. మామూలు సమయంలో కంటే సీజన్ సమయంలో డబుల్ రెట్లు తీసుకుంటూ వారు చెప్పిందే ఫైనల్ అంటున్నారు. దీంతో కొంత మంది యువత వారికి పరిచయాల వద్ద తక్కువ ధర తీసుకుంటే.. ఇక అంతే. వారు ఏదో గొడవ చేస్తున్నారని నిందలు వేస్తూ.. వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

## రాజన్న సేవలో ఆర్య వైశ్య కార్పొరేషన్ ఛైర్‌పర్సన్

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**



వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామిని తెలంగాణ ఆర్య వైశ్య కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ కాల్వ సుజాత శనివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం నాగిరెడ్డి మండపంలో వేద పండితులు, ఆలయ అర్చకులు ఆమెకు ఆశీర్వచనం అందించి, స్వామివారి లడ్డు ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట పర్యవేక్షకులు నూగూరి నరేందర్, ప్రోటోకాల్ సీనియర్ అసిస్టెంట్ బొడుసు మహేష్, ఆలయ సిబ్బంది ఉన్నారు.

# ఇంటింటికి సంక్షేమ పథకాలను తీసుకెళ్దాం . కోమటిరెడ్డి

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ 3సెప్టెంబర్ 13**
డివిజన్లలో మీరే కథానాయకులై పనిచేయండి వార్డు ఆఫీసర్లు,మిగితా అధికారులతో కలిసి అర్హులైన లబ్ధిదారులకు న్యాయం జరిగేట్టు చూడండి ఇందిరమ్మ ఇండ్లు,డబుల్ బెడ్రూం ఇండ్లు అర్హులైనవారుకి చెందే విధంగా పనిచేయండి ప్రతి ఇంటికి వెళ్ళండి,సంక్షేమ పథకాలు వివరించండి కార్పొరేషన్ పై కాంగ్రెస్ జండా ఎగరేద్దాం కష్టకాలంలో పనిచేసిన వారికి పార్టీ అండగా ఉంటుంది అందుకు నేనే ఉదాహరణ పార్టీ టికెట్లు అధిష్టానం చూసుకుంటుంది,కష్టపడి పని చేసిన వారికి ప్రాధాన్యత ఇస్తుంది నగర కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశంలో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు,సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి దిశా నిర్దేశం ప్రతి ఇంటికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందిస్తున్న ప్రజాపాలనను పిసిసి అధ్యక్షుడు




మహేష్ కుమార్ గౌడ్ యొక్క చిత్తశుద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మున్సిపల్ కార్పోరేషన్ పై కాంగ్రెస్ జండా ఎగురవేయాలని సుడా చైర్మన్ నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పిలుపునిచ్చారు.జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన నగర కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశంలో డివిజన్ల అధ్యక్షులకు,ఇంచార్జిలకు నగర కాంగ్రెస్ నాయకులకు పలు విషయాలపై దిశా నిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో ప్రభుత్వం మరియు కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తుందని కరీంనగర్ లో ఉమ్మడి జిల్లా మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు,పొన్నం ప్రభాకర్,అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అదేవిధంగా డిసిసి అధ్యక్షుడు డా.కవ్వంపల్లి సత్యనారాయణ కరీంనగర్ ను ఆనుకొని ఉన్న చొప్పదండి శాసన సభ్యుడు మేడిపల్లి సత్యంతో పాటు అందరి పర్యవేక్షణలో కరీంనగర్ కార్పోరేషన్ పై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని దీంట్లో ఎటువంటి సందేహం లేదని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.స్థానిక నాయకులు డివిజన్లలో కథానాయకులై పని చేయాలని అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా చూడాలని ప్రతి ఇంటిని టచ్ చేయాలని నగరంలో భూమి ఉన్న ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చే అవకాశం ఉందని డబుల్ బెడ్రూం ఇండ్లు అర్హులకు దక్కేలా చూడాలని బతుకమ్మ చీరలు పంపిణీ లో భాగస్వామ్యం కావాలని నరేందర్ రెడ్డి సూచించారు.పార్టీ కోసం కష్టకాలంలో పనిచేసిన ప్రతి ఒక్కరిని పార్టీ గుర్తిస్తుందని అందుకు నేనే ఉదాహరణ అని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.కార్పోరేటర్ టికెట్లు ఎవ్వరికి ఇవ్వాలో అధిష్టానం చూసుకుంటుందని ఆది ఏఒక్కరి చేతిలో ఉండదని నరేందర్ రెడ్డి అన్నారు.అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఎవ్వరమైనా పార్టీ సిద్ధాంతాల ప్రకారం నడుచుకోవలసిందే అని మేము ఎన్నికల్లో పోటీ చేసినప్పటికి పార్టీ పదవులలో ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తూ పనిచేయాల్సిందే అని నాకు ఎటువంటి గ్రూపులు లేవని అందరితో కలిసి నా శక్తి మేరకు పని చేస్తానని అన్నారు.మాజీ శాసన సభ్యుడు ఆరెపల్లి మోహన్ మాట్లాడుతూ పార్టీలో పని చేసిన వారికి అక్కడక్కడ పోటీ చేసే అవకాశం రాకపోయినా వారికి తగిన ప్రాధాన్యత ఇచ్చి వేరే రకంగా పార్టీ అయినా అవకాశం కల్పిస్తుందని నేను నలభై ఏళ్లుగా గమనిస్తున్నానని అన్నారు.ఈ సమావేశంలో పలువురు డివిజన్ల భాధ్యులు మాట్లాడుతూ కొంతమంది అధికారులు కనీస సమాచారం ఇవ్వడం లేదని మాజీ కార్పొరేటర్లు చెప్పినట్టే వింటున్నారని నరేందర్ రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు.ఈ సమావేశంలో సెల్స్ అధ్యక్షులు ఎండి తాజ్,కొరివి అరుణ్ కుమార్,శ్రవణ్ నాయక్,సమద్ నవాబ్,లాయక్,జీడి రమేష్,చర్ల పద్మ,ఖమ్రోద్దీన్,ఎలగందుల మల్లేశం,కుర్ర పోచయ్య,అబ్దుల్ రహమాన్ అన్ని డివిజన్ల అధ్యక్షులు,ఇంచార్జులు ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి యోగాలో ఛాంపియన్గా నిలవాలి.

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ సెప్టెంబర్ 13**



ఈనెల 14న నల్గొండ జిల్లాలో జరిగే 12వ సీనియర్స్ యోగాసన స్పోర్ట్స్ చాంపియన్షిప్లో కరీంనగర్ జిల్లా యోగా క్రీడాకారులు ఛాంపియన్గా నిలవాలని కరీంనగర్ జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షులు సర్దార్ రవీందర్ సింగ్ అన్నారు. శనివారం స్థానిక డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్టేడియంలో జిల్లా జట్టుతో ఫొటో ప్రోగ్రాం సందర్భంగా ఇటీవల జిల్లాకు ఎంపికైన యోగా క్రీడాకారులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి లో అత్యంత ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు జిల్లా నుండి అత్యధిక క్రీడాకారులు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ఇట్టి పోటీలకు వివిధ ఏజ్ కేటగిరీలలో ఎంపికైన వారిలో పురుషుల విభాగంలో కె. నామన్ ఆర్య, సిహెచ్. శ్రీధర్, పి. స్వరూప చారి, ఎల్. కోటేశ్వరరావు మహిళల విభాగంలో పి. లహరిక, టి. లక్ష్మీ తేజ, బి. ప్రవళిక, శ్రీనిధి, బి. నిర్మల, జే. ఆమని, ఆర్. మనీషా, బి. సమత, ఎన్. శైలజ, ఎం. రమాదేవి, పి. సుగుణ ఏ. రమ తదితరులు , కోచ్ మేనేజర్లుగా జి. రామకృష్ణ , పి. మల్లేశ్వరి లు పాల్గొంటున్నారని తెలిపారు. క్రీడాకారుల ఎంపిక పట్ల కరీంనగర్ డి వై ఎస్ ఓ వి. శ్రీనివాస్, జిల్లా యోగా అసోసియేషన్ ఉపాధ్యక్షులు కన్న కృష్ణ, కార్యదర్శి నాగిరెడ్డి సిద్ధారెడ్డి , యోగ కోచులు వి. కిష్టయ్య, జి. రామకృష్ణ, పి. మల్లేశ్వరి, ఏ ఆనంద కిషోర్, కెసారం తిరుపతి తదితరులు క్రీడాకారులను అభినందించారు.

## ఆనందోత్సాహాల మధ్య గాజుల వేడుక

**- పాల్గొన్న ఎమ్మెల్యే సతీమణి మనాలి ఠాకూర్**



**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని సెప్టెంబర్ 13:**
రామగుండం కార్పొరేషన్ పరిధిలోని 7వ డివిజన్ గంగానగర్ ప్రాంతంలో స్థానిక మహిళలు ఎంతో ఆనందంగా నిర్వహించిన గాజుల వేడుక కార్యక్రమంలో రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ సతీమణి శ్రీమతి మనాలి ఠాకూర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలతో కలిసి పండుగ వాతావరణంలో భాగస్వామ్యమై, గాజులు తొడగడం ద్వారా వారికి శుభాకాంక్షలు తెలిపారు. మహిళల ఐక్యత, సాంప్రదాయాల పట్ల ఉన్న నిబద్ధతను అభినందించిన మనాలి ఠాకూర్, మహిళల అభ్యున్నతి కోసం ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అలాగే గంగానగర్ ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను మహిళలకు వివరించి, మరింత బలంగా వాటిని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు మనాలి ఠాకూర్ ని ఘనంగా సన్మానించి, తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

## అంతర్జాతీయ క్రీడా సదస్సుకు ఎంపికైన అశోక్.

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ సెప్టెంబర్ 13**
మొదటి అంతర్జాతీయ క్రీడా సదస్సుకు గుగులోత్ అశోక్ కుమార్ ఎంపికైనట్లుగా కరీంనగర్ జిల్లా ఒలంపిక్ అసోసియేష న్ కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు తుమ్మల రమేష్ రెడ్డి, జిల్లా యోగా అసోసియేషన్ కార్యదర్శి నాగిరెడ్డి సిద్ధారెడ్డిలు హర్షం వ్యక్తపరిచారు. ఈనెల 18 నుండి 20 వరకు నేషనల్ అసోసియేషన్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్స్ ఆధ్వర్యంలో మలేషియాలో జరగనున్న మొదటి అంతర్జాతీయ క్రీడా సదస్సులో కరీంనగర్లో గతంలో రెజ్లింగ్ కోచ్గా , డివైఎస్ఓగా పనిచేసిన గుగులోత్ అశోక్ కుమార్ అంతర్జాతీయ సదస్సులో పాల్గొంటున్నారని తెలిపారు. ఒక రెస్లింగ్ క్రీడాకారునిపై ఫిజికల్ ఎడ్యుకేషన్ లో రీసెర్చ్ చేస్తున్న సందర్భంగా అతనికి వచ్చిన ఆహ్వానం మేరకు పాల్గొనుచున్న సందర్భంగా ఆయనను అభినందిస్తూ క్రీడారంగంలో విశిష్టమైన సేవలు అందించి రాబోయే తరానికి ఒక దిక్సూచిగా ఉండాలని కోరారు.



# ఉల్లాసంగా ఉత్సాహంగా పారమిత ఉపాధ్యాయుల రంగేళి సాంజ్ వేడుకలు

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ సెప్టెంబర్ 13**
కరీంనగర్ పట్టణ శివారులోని మహాలక్ష్మి కన్వెన్షన్లో సుమారు 700 మంది పారమిత ఉపాధ్యాయులు రంగేళి సాంజ్ అనే పేరుతో సాంస్కృతిక కార్యక్రమాలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. పారమిత విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఇనుగంటి ప్రసాద రావు ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పారమిత పాఠశాలల ఉపాధ్యాయులందరూ వివిధ నృత్యాలతో, పాటలతో, ఉపన్యాసాలతో, నాటికలతో అందరిని ఆకట్టుకున్నారు.ఈ సందర్భంగా పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఈ.ప్రసాద రావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు బోధననే కాకుండా



నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి ఉల్లాసవంతమైన జీవితాన్ని గడపడానికి అప్పుడప్పుడు ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని మానసిక ఉల్లాసాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. పారమిత గత 30 సంవత్సరములనుండి ఇలాంటి కార్యక్రమాన్ని చేపడుతూ వారి మనసులలో ఆనందాన్ని నింపుతున్నామని సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా ఉపాధ్యాయులు తమను తాము మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకుంటారని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు ప్రసూన, అనూకర్ రావు, రష్మిత, రాకేశ్, ప్రాచీ, వి.యు.యం. ప్రసాద్, వినోద్ రావు, హన్మంతరావు, ప్రధానోపాధ్యాయులు బాలాజీ, ప్రశాంత్, శ్రీకర్, గోపీకృష్ణ, శర్మిష్ట, కవితాప్రసాద్, సమన్వయ కర్తలు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ కి రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలి

**- కళాశాల బంద్ కి మద్దతు తెలిపిన యాజమాన్యాలు**
**- ఈనెల 18 లోగా బకాయిలు చెల్లించాలి**
**- బంద్ బాటలో బెస్ట్ అవైలబుల్ స్కూల్స్**

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, సెప్టెంబర్13**
జమ్మికుంటలోని న్యూ మిలీనియం స్కూలు లో ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల బెస్ట్ అవైలబుల్ స్కూళ్ల యాజమాన్యాల సమావేశం నిర్వహించారు.. కొన్ని సంవత్సరాలుగా ఈ స్కూళ్లకు విద్యార్థుల కు రావాల్సిన బకాయిలు పెండింగ్ లో ఉన్న అంశంపై సమావేశం ఏర్పాటు చేశారు. ఇంటర్ మీడియట్, డిగ్రీ కళాశాలల యాజమాన్యాల వలె స్కూళ్లు సహాయ నిరాకరణ బాటలో పయనించాలని నిర్ణయించారు. సుమారు యాభై స్కూళ్ల యాజమాన్యాల పాల్గొన్న ఈ




సమావేశంలో అతిథిగా పాల్గొన్న యాదగిరి శేఖర్ రావు హాజరై రెండు రోజుల్లో కార్యాచరణ ప్రకటిస్తామని పేర్కొన్నారు.. పాఠశాల దసరా సెలవుల తర్వాత పునః ప్రారంభం కష్టతరం అవుతుందని అన్నారు. బాస్ స్కీమ్ పిల్లల తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్తుకు నీలు నీడలు కమ్ముకున్నాయని అన్నారు.. రాష్ట్ర వ్యాప్తంగా సంబంధిత అధికారులు, మంత్రులు ప్రజా ప్రతినిధులు వెళ్లి పాఠశాలలకు రావాల్సిన బకాయిలు చెల్లించే విధంగా ప్రయత్నం చేయాలని సూచించారు.. పాఠశాలలు తిరిగి పునః ప్రారంభం చేయలేని పరిస్థితి ఉందని ఈ నెల 18 తేదీ లోపు బకాయిలు చెల్లించని పక్షంలో తదుపరి కార్యాచరణను విడుదల చేస్తామని అన్నారు.వృత్తి విద్యా కళాశాలలు, జూనియర్ డిగ్రీ కళాశాలలు వారి కార్యాచరణకు మద్దతు ఇస్తున్నట్లు చెప్పారు.. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రవేట్ స్కూళ్ల యాజమాన్యాల సంఘం పూర్వ అధ్యక్షుడు యాదగిరి శేఖర్ రావు, కరీంనగర్ జిల్లా అధ్యక్షులు కోరం సంజీవ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ముసిపట్ల తిరుపతి రెడ్డి , జమ్మికుంట పట్టణ అధ్యక్షులు డాక్టర్ పుల్లూరి సంపత్ రావు, లక్ష్మారెడ్డి, శ్రీనివార్ రెడ్డి కరీంనగర్, వరంగల్ జిల్లాల స్కూళ్ళ యాజమాన్యాలు పాల్గొన్నారు.

# రామగుండంలో రాక్షస పాలన...

**- ప్రజాస్వామ్యం ఖుని... ప్రశ్నిస్తే కేసులు... అడిగితే కుల్చివేతలు...**
**- చట్టాలు ఎమ్మెల్యేకు చుట్టాలుగా మారాయి**
**- 21 నెలలుగా అరాచక పాలన సాగిస్తున్న ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్**
**- కూల్చివేతల పేరుతో చిరు వ్యాపారులను రోడ్డున పడేస్తూ రాక్షస ఆనందం**
**- 15న బంద్.. ఛలో కలెక్టరేట్**
**- మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్**

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని సెప్టెంబర్ 13:**
రామగుండంలో రాక్షస పాలన నడుస్తోంది... రామగుండం ఎమ్మెల్యే మాక్కాన్ సింగ్ ప్రజాస్వామ్యం ఖుని చెస్తున్నారు.. .ప్రశ్నిస్తే కేసులు... అడిగితే కుల్చివేతలు చేస్తూ రామగుండం ప్రజలను భయ భ్రాంతులకు గురి చేస్తు రాక్షస అనందం పోందుతున్నరని,
రామగుండం నియోజకవర్గంలో చట్టాలు ఎమ్మెల్యేకు చుట్టాలుగా మారాయని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ బి.ఆర్.ఎస్ నాయకులు కౌశిక హరితో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా




మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మాట్లాడుతూ 21 నెలలుగా అరాచక పాలన సాగుతుందని, కూల్చివేతల పేరుతో చిరు వ్యాపారులను రోడ్డున పడేస్తూ రాక్షస ఆనందం పొందుతున్నారన్నారు. రోడ్డు వెడల్పు పేరుతో జరుగుతున్న కూల్చివేతలు చిరు వ్యాపారుల జీవితాలను నాశనం చేశాయన్నారు.
ప్రజలు ప్రశ్నిస్తే కేసులు పెట్టి బెదిరింపులకు పాల్పడుతున్నరని నేపాల్లో ప్రజలు అరాచక పాలనను భరించలేక ప్రధాని సీటు దింపేశారని, రామగుండంలో పునరావృతం కాకుండా జాగ్రత్తపడాలని సూచించారు. ఒకరు షాపులకు పర్మిషన్ ఇస్తే మరొకరు వచ్చి కూల్చేస్తున్న పరిస్థితి నెలకొన్నదని, దీంతో చిన్న వ్యాపారులు నష్టపోతున్నారని, వారికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మీరు గోదావరిఖనిని ఏం చేయదలుచుకున్నారు..? అసలు మీ ప్రణాళిక ఏమిటి.. ప్రజలకు బహిరంగంగా వివరించాలని అన్నారు. ప్రజలు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా పాలేరులతో మాట్లాడిస్తున్నారని ఆరోపించారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతం, ఎన్టీపీసీలో కుల్చివేసినా దుకాణదారులకు నష్టపరిహారం చెల్లించాలని వారికి ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలని డిమాండ్ చేసారు. బి.ఆర్.ఎస్ పార్టీ చిరు వ్యాపారులు పట్ల పోరాడుతుందని సోమవారం బంద్‌తో పాటు చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఆయన ప్రకటించారు. ఈ విలేఖరుల సమావేశంలో మాజీ కార్పోరేటర్లు కుమ్మరి శ్రీనివాస్, గాధం విజయ, బాదె అంజలి, నాయకులు బోడ్డు రవీందర్, నారాయణదాసు మారుతి, బోడ్డుపల్లి శ్రీనివాస్, గుంపుల లక్ష్మి, నూతి తిరుపతి, మేతుకు దేవరాజ్ నీరటీ, శ్రీనివాస్, తోకల రమేష్, సట్టు శ్రీనివాస్, అర్శనపల్లి శ్రీనివాస్, సింహచలం రత్నకర్, జక్కుల తిరుపతి, బుర్ర వెంకటేష్, ఇరుగురాళ్ల శ్రవన్, ఆవునూరి వెంకటేష్, కర్రీ ఓదేలు, యాసర్ల తిమ్మెతి, చింటూ, కొడి రామకృష్ణ, కనకలక్ష్మి, బచ్చాల రాములు, రామారాజు తదితరులు పాల్గొన్నారు.